క్లుప్తంగా

సరస్వతిదేవి అలంకరణలో గౌరీదేవి



వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిని శ్రీగౌరీదేవి ఆలయంలో అమ్మవారు ఆదివారం సరస్వతీదేవి అలకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారని ఆలయ అధ్యక్షుడు కుల్లాయప్ప, చంద్రశేఖర్‌లు తెలిపారు. కార్తీక మహోత్సవాలలో భాగంగా ఉదయం నుంచి ఆలయ అర్చకులు శంకర మంచి ప్రసాదు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదులు అందచేశారు. అలాగే రాత్రి సమయంలో ప్రసాదు, జగదీష్ ఆధ్వర్యంలో సాసల చిన్నమ్మ కథ, కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో భక్తులు విందుభోజనాలను ఆరగించారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న 3 ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ వసంతా బాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విభరాపురం–(ఓసీ), వల్లూరు మండలం చిన్నపుత్త (బీసీ–సీ), కొప్పోలు మెయిన్ (బీసీ–ఎ) అభ్యర్థులకు రోస్టరు ప్రకారం కేటాయించామన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై, 2023 జూలై 1 నాటికి 21 సం. పూర్తి అయి, 35 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులని ఆమె తెలిపారు. టెన్త్ క్లాస్ ఉత్తీర్ణులైన వారు లేని పక్షంలో అంత కన్న తక్కువ విద్యార్హత ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సమగ్ర పోషకాలపై రైతులకు అవగాహన

సింహాద్రిపురం : సమగ్ర పోషకాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఏరిస్ కంపెనీ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏరిస్ కంపెనీ 54వ వార్షికోత్సవం సందర్భంగా చీనీ, అరటి రైతులకు తోటలపై ప్రిన్సిపాల్ సైంటిస్ట్ శ్రీనివాసులరెడ్డి, మండల సలహా రైతు అధ్యక్షుడు అరవింద్‌నాథ్‌రెడ్డిలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ఏఓ శివకుమార్‌రెడ్డి, అరటి రీసర్చ్ స్టేషన్ హెడ్ నాగేంద్రరెడ్డి, కంపెనీ ఆర్ ఎం సురేష్‌కుమార్‌లు మాట్లాడుతూ ఉద్యాన పంటలపై అధికారులు చెప్పే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక

బద్వేలు అర్బన్ : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆదివారం జరిగిన పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం సమావేశంలో నియోజకవర్గ స్థాయి నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ ప్రభుకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా షేక్ ఆరిఫ్, ఉపాధ్యక్షుడిగా ఎస్.విద్యాసాగర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.సునీత, కార్యదర్శిగా సి.వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా జీవన్‌తేజ, కోశాధికారిగా పి.చంద్రశేఖర్, కో ఆప్షన్ మెంబర్‌గా చెన్నమ్మలను ఎన్నుకున్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమితో కళకళలాడిన శైవక్షేత్రాలు

పులివెందుల టౌన్ : కార్తీక మాసంలో పరమశివున్ని ఆరాధించి, నోములు నోచుకుని తమ మొక్కులు తీర్చుకుంటారు. కార్తీక మాసాంతమంతా తమ ఇంటి ముంగిట కార్తీక దీపాలు వెలిగించి దీపకాంతులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతిరోజు తెల్లవారు జామున చన్నీటి స్నానాలు ఆచరించి శివాలయాలకు వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆదివారం పట్టణంలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని కార్తీక దీపాలను వెలిగించేందుకు తెల్లవారు జామున 4 గంటలనుంచే మహిళలు ఉసిరికాయలపై జ్యోతిని వెలిగించారు. ఆలయం చుట్టూ కార్తీక దీపాలను వెలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు మిట్టమల్లేశ్వరుడిని దర్శించుకున్నారు. మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు శివమనోహర్ జ్వాలాతోరణం వెలిగించి ఓం నమఃశివాయ నామస్మరణలతో హోరెత్తించారు. అలాగే అమ్మవారిశాల, వీరభద్రస్వామి, షిర్డి సాయిబాబా, ఉమామహేశ్వరస్వామి(బసవన్న కట్ట) తదితర ఆలయాలు భక్తులతో నిండుగా దర్శనమిచ్చారు.



ఎర్రగుంట్ల : కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



కమలాపురం : కోటీ మహా దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

భక్తులతో కిటకిట లాడిన పొలతల క్షేత్రం

పెండ్లిమర్రి : పొలతల ఆదివారం భక్తులతో కిట కిట లాడింది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మల్లికార్జునస్వామి, అమ్మ వార్లను దర్శించుకునేందుకు జిల్లా నలు మూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో పొలతల క్షేత్రం భక్తులతో కిటకిట లాడింది. మధ్యాహ్నం నుంచి పౌర్ణమి రావడంతో మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు జ్వాలా తోరణాన్ని వెలగించారు. స్వామి, అమ్మవార్లను రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారి రాకను పురస్కరించుకుని పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాస్ ఏర్పాట్లు సిద్ధం చేశారు.

ఎర్రగుంట్ల : కార్తీక పౌర్ణమి పురస్కరించుకోని ఆదివారం రాత్రి మండల పరిధిలోని అన్ని శివాలయాలలో కార్తీక దీపారాధన మహోత్సవం వైభవంగా జరిగింది. ప్రధానంగా పట్టణంలోని దొండపాడ రస్తాలో వెలసిన శ్రీ శివాలయంలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని కార్తీక దీపాలను వెలింగించారు. పట్టణంలోని మహేశ్వరనగర్ కాలనీలోని శివాలయంలో, ఐసీఎల్ కాలనీలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపారాధన వైభవంగా జరిగింది.

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన శ్రీ మోక్ష నారాయణస్వామి ఆలయంలో కోటి మహాదీపోత్సవంను కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం కార్తీక మాస పౌర్ణమిని పురస్కరించుకుని కోటి మహాదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వీరపునాయునిపల్లె : సంగాలపల్లెలోని శివకృష్ణ గోశాలలో ఆదివారం పౌర్ణమి వేడుకలను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన భజన బృందం నిర్వహించిన తాళాల భజన భక్తులను అలరించింది. ఆలయ నిర్వాహకులు రాజశేఖర్‌రెడ్డి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు సంగమేశ్వరాలయంలో...

మండలంలోని సంగమేశ్వరాలయంలో కార్తీకమాసం రెండవ సోమవారం, పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు శివ పార్వతుల కల్యాణం అలాగే సాయంత్రం 6 గంటలకు జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్య శర్మ, ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి తెలిపారు. పౌర్ణమి మరియు సోమవారం రెండు కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తారని వారికోసం అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కాశిరెడ్డినాయన ఆలయంలో..

మండలంలోని ఎస్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన అవదూత కాశిరెడ్డినాయన ఆలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కటికం లక్ష్మిరెడ్డి తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



పులివెందులలో మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పొలతలలో స్వామి వార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దంపతులు



వీఎన్‌పల్లె : సంగాలపల్లెలో గోమాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

29న దివ్యాంగులకు అలింకో సహాయ పరికరాల పంపిణీ

పులివెందుల టౌన్ : స్థానిక అహోబిలాపురం మెయిన్ ఉన్నత పాఠశాలలో 29వ తేదీన నియోజకవర్గంలోని దివ్యాంగులకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో అలింకో సంస్థ ద్వారా సహాయ పరికరాలు పంపిణీ, వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో పులివెందుల పట్టణం లోని రవణప్పసత్రం పాఠశాలలో ప్రధాన మంత్రి మోడీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ (అలింకో) భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకుని అర్హత పొందిన దివ్యాంగులకు ఈనెల 29న ఎంపీచే పరికరాలు పంపిణీ చేయనున్నారు. ఈ అవకాశాన్ని దాదాపు 700 మంది సద్వినియోగం చేసుకోనున్నారని.. ఇందుకు సహాయ సహకారాలు అందజేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఏపీ దివ్యాంగుల నెట్‌వర్క్ తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు 9247339815 నంబరుకు సంప్రదించాలన్నారు.

మానవత ఆర్థిక సాయం



దీనబంధు ఆశ్రమ నిర్వాకుడికి ఆర్థికసాయం అందజేస్తున్న మానవత సభ్యులు



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కార్మిక సంఘ అధ్యక్షుడు తదితరులు

పులివెందుల టౌన్ : స్థానిక చిన్నన్న రాముల వీధిలో ఉన్న మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ధీన బంధు ఆశ్రమానికి, విద్యార్థికి రూ.11 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు సుబ్బరాయుడు అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి పంచాయతీరాజ్ డీఈఈ సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా దీనబంధు ఆశ్రమానికి నిర్వాహకుడు జనార్ధన్‌కు రూ.8 వేలు చెక్కును అందజేశారు. అలాగే డిగ్రీ చదువుతున్న పేదవిద్యార్థిని సాయిదీపికకు రూ.3వేలు చెక్కును వితరణగా అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ రంగారెడ్డి, మానవత చైర్మన్ కొండారెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే పట్టనంలోని క్రిష్టియన్‌లైన్‌లో ఉంటున్న భవన నిర్మాణ కార్మికుడు గొందిపల్లె మనోహర్ ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందడంతో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు దహన సంస్కారాలకు రూ.5 వేలు అందజేశారు.

కార్మికులకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటామని ఆ సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు చలపతి, ఉపాధ్యక్షుడు టైటస్, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గడువు లోపు అధిక పెన్షన్ ఇవ్వాలి

మైదుకూరు : ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు అధిక పెన్షన్ ఇవ్వాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనిటీ అసోసియేషన్ కడప జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కేకే కుమార్, ఎస్ఆర్ శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం మైదుకూరు డిపోలో ఎంప్లాయిస్ యూనిటీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఎం.నారాయణ అధ్యక్షత నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కుమార్, శేఖర్ మాట్లాడుతూ అన్ని చోట్ల క్యాడర్ స్ట్రెంగ్త్ సమస వలన ఉద్యోగులకు ఇబ్బందులు ఉన్నాయన్నారు. సుమారు 16 నెలల కాలంగా రిమూవల్ అప్పీల్స్‌పైన ఇప్పటి వరకూ ఎలాంటి ఆదేశాలు రాలేదని, ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధిక పెన్షన్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు (తీర్పు) అమలులో భాగంగా ఆర్టీసీ మేనేజ్‌మెంట్ జారీ చేసిన సర్క్యులర్‌లోని అంశాలను అమలు చేయాలని కోరారు. అధిక పెన్షన్ ఇవ్వడం వలన ఉద్యోగికి లబ్ది చేకూరుతుందని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జోనల్ కమిటీ సభ్యుడు పీఎస్‌పీ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.బోసుబాబు, రామమూర్తి, డిపో కార్యదర్శి టీపీ మునెయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి ఏపీ శివరాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇతర యూనియన్ల నుండి 12 మంది ఉద్యోగులు ఎంప్లాయిస్ యూనిటీ అసోసియేషన్‌లో చేరగా వారిని డిపో కమిటీ నాయకులు ఆహ్వానించారు.

భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి



పులివెందులలో కేక్‌ను కట్ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు



కమలాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



వేంపల్లె : భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరమని వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం 74వ భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, ఎస్సీ నాయకులతో కలసి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం మనదే కావడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రపంచంలో ఎక్కడలేని అన్ని మతాలకు ఇక్కడ జీవించే హక్కుతోపాటు అన్ని హక్కులు కల్పించడం గొప్ప వరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు, కోడి రమణ, పార్నపల్లె కిషోర్, విజయ్‌నాయుడు, పురుషోత్తమ్, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఎస్సీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుడ్‌సైన్స్ కళాశాలలో :

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక పుడ్‌సైన్స్ కళాశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ బేగ్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కమలాపురం : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని నవ్యాంధ్ర మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కొర్రపాటి సుధీర్, మహజన రాష్ట్ర సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. రాజ్యాంగం ఆమోదించి 74 ఏళ్లు పూర్తి అయిన నేపథ్యంలో ఆదివారం స్థానిక క్రాస్ రోడ్డు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అతిపెద్ద ప్రజా స్వామ్య దేశమైన మన దేశాన్ని ఒకే తాటిపై నడిపించగల విలువైన రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రచించారన్నారు. ఎన్నో అవమానాలను ఎదుర్కొని బడుగు, బలహీనుల కోసం తన కుటుంబాన్ని, జీవితాన్ని త్యాగం చేసి 2 ఏళ్ల 11 నెలల 23 రోజుల పాటు శ్రమించి రాజ్యాంగాన్ని రచించిన మేధావి, జ్ఞాని అంబేడ్కర్ అని వారు స్మరించుకున్నారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర మాల మహానాడు, ఎంఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : పట్టణంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల(మెయిన్)లో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బిరెడ్డి అంబెడ్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాలర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్లు, వలంటీర్లు క్యాంపస్‌లో ర్యాలీ నిర్వహించి రాజ్యాంగ రచనపై ప్రసంగించారు. రాజ్యాంగం యొక్క సవరణలు, మెలుకువల గురించి ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ విశ్వనాథరెడ్డి, డాక్టర్ రమేష్‌లు అవగాహన కల్పించారు. ఈ సమావేశం వలంటీర్లకు ఎంతగానో ఉపయోగపడిందని ట్రిపుల్ ఐటీ పరిపాలనాధికారి రాంభూపాల్‌రెడ్డి తెలిపారు.


మహా ధర్నాను జయప్రదం చేయండి

మైదుకూరు : కార్మిక చట్టాలను, ప్రభుత్వ రంగాలను రక్షించాలని, రైతుల నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27, 28వ తేదీల్లో విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ, ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మైదుకూరులో జరిగిన సమావేశంలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ ప్రభుత్వంపై భారాన్ని మోపుతోందని ఆరోపించారు.

కార్మికులకు అండగా ఉంటే చట్టాలను మార్చి వారి జీవితాలను రోడ్డుపాలు చేశారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా కార్పొరేట్ కంపెనీలకు విక్రయిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతు సంఘాల సమన్వయ వేదిక, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ మహాధర్నా నిర్వహిస్తున్నారని వారు పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ, దాని అనుబంధ సంఘాల నాయకులు భాస్కర్, శ్రీరాములు, ఏపీ శివరాం, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందంగా.. రక్షణగా

పెద్దముడియం : సాధారణంగా మిరప పంటలో బంతిపూలను చూస్తుంటాం. చాలా మంది పూలకోసమో లేదా పంటకు దిష్టి తగలకుండా, అందంగా ఉండాలనో వేస్తారని అనుకుంటాం. కాని బంతి పూలు సాగుచేయడం వలన లద్దె పురుగు, రసం పీల్చే పురుగు, శనగ పచ్చ పురుగులు పంటను ఆశించవు. బంతి పూలు లేకపోతే ఈ పురుగులు మిరప ఆకులను ఆశిస్తాయి.ఆకులను తినేస్తే కిరణ జన్య సంయోగక్రియ జరగక పంట దెబ్బతింటుంది. దీంతో మిరపకు రక్షణగా, అందంగా పురుగులను ఆకర్షించేలా ఉంటుండటంతో బంతి పూలను ఎర పంటగా వేస్తారు. అయితే పచ్చని ఆకులతో నిండుగా ఉండే మిరప తోటలో పసుపు, నారింజ రంగు పూలతో పంటకు అందం తెస్తాయి. రక్షణగా, అందంగా ఉంటూ రైతన్నలకు మేలు చేకూరుస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు.



పెద్దపసుపుల గ్రామం వద్ద మిరప పంటలో వేసిన బంతిపూలు

అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ

పోరుమామిళ్ల : దుకాణాల ముందు, బస్టాండులో, గుడుల ముందు రాత్రిల్లు నిద్రిస్తున్న అనాధలు, అభాగ్యులకు, యాచకులకు వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, రామతులసి దుప్పట్లు పంపిణీ చేశారు. శనివారం రాత్రి వారు సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, జయరాంలతో కలసి పట్టణంలో తిరిగి చలికి వణుకుతూ నిద్రపోతున్న అభాగ్యులకు దుప్పట్లు కప్పారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చలికాలంలో రాత్రిల్లు ఇబ్బందులు పడుతున్న అనాధలకు దాతల సహకారంతో దుప్పట్లు అందిస్తున్నామన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక ప్రదర్శనలు



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో చిన్నారులు



కోలాట నృత్యంలో చిన్నారులు

పులివెందుల టౌన్ : పట్టణ పరిధిలోని శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. మదనపల్లెకు చెందిన శ్రీసూర్య డ్యాన్స్ అకాడమి మాస్టర్ సూర్యకుమార్ నేతృత్వంలో చిన్నారులు వెస్టన్ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు చేసిన నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి సుధకర్, సిబ్బంది పాల్గొన్నారు.